

సచివాలయాన్ని పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పూల్ బాగ్ లోని రెండవ నెంబర్ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నైపుణ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకొని మెరుగైన పౌర సేవలను అందించాలని కార్యదర్శులకు సూచించారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ రేవతి దేవి, స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు ఉన్నారు.

గురజాడ గొప్ప సంఘ సంస్కర్త

- ఎస్‌సి సంక్షేమ అసెంబ్లీ కమిటీ ఛైర్మన్ బాబూరావు
- నివాళులర్పించిన కమిటీ సభ్యులు
- గురజాడ వినియోగించిన వస్తువులతో ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు గొప్ప సంఘ సంస్కర్త, ఆధునిక అభ్యుదయ వాది అని రాష్ట్ర ఎస్‌సి సంక్షేమ అసెంబ్లీ కమిటీ ఛైర్మన్ గొల్ల బాబూరావు పేర్కొన్నారు. సాంఘిక దురాచారాలను పారద్రోలి సమాజంలో చైతన్యం తీసుకొచ్చిన ఘనుడు అని కీర్తించారు. ఆధ్యాత్మిక, ఛాందస వాదుల గుండెల్లో గురజాడ ఒక బాంబు లాంటివారని అన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన కమిటీ ఛైర్మన్, సభ్యులు గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వగృహంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గురజాడ వారసులైన వెంకట ప్రసాద్, ఇందిరతో కలిసి గురజాడ రచించిన పుస్తకాలను, స్టాంపులను పట్టుకొని ర్యాలీగా ఆయన విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ సమాజానికి గురజాడ చేసిన సేవలను కొనియాడారు. తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడైన గిడుగు రామ్మూర్తి పంతుల మాదిరిగానే ఆధునిక భావజాలంతో కూడిన రచనలను గురజాడ సాగించారని గుర్తు చేశారు. తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారని, ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్, గురజాడ వెంకట అప్పారావు లాంటి మహనీయుల జీవితాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఇతర సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాలులర్పిస్తున్న కమిటీ ఛైర్మన్ బాబూరావు, సభ్యులు

గురజాడ చిరస్మరణీయులు

గురజాడ అప్పారావు ఎన్ని యుగాలైన మరచిపోలేని వ్యక్తి అని కలెక్టర్ సూర్య కుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురజాడ విగ్రహానికి ఎస్‌పి దీపికా పాటిల్, ఎమ్మెల్యే కంబాల జోగులు, జె.సి మయూర్ అశోక్‌తో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తోటి వారికి సహాయాన్ని అందించాలని గురజాడ చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఆయన ఆశయాలను భావి తరాలకు అందించడమే ఆయనకు నిజమైన నివాళి యని అన్నారు.కార్యక్రమంలో డిఆర్‌ఒ గణపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిరుగులేని గురజాడ అడుగు జాడ

గురజాడ అడుగుజాడ తిరుగులేని జాడ అని జిల్లా కేంద్ర గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఎన్.లలిత అన్నారు. కేంద్ర గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురజాడ సమాజ ఉద్ధరణకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

సాహితీ విపణిలో శిఖరం

విజయనగరం టౌన్ : తెలుగు భాష, సాహిత్య, నాటక వికాసానికి గురజాడ చేసిన సేవలు వెల కట్టలేనివని గిరిజన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టమణి అన్నారు. నేటితరం విద్యార్థులు గురజాడ అడుగుజాడలలో నడవాలని పిలుపు నిచ్చారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకొని యూనివర్శిటీలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జెఎన్‌టియు గురజాడలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.బాబులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.రమణ, సూపరింటెండెంట్ చందు గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

గురజాడ రచనలు ఆదర్శప్రాయం

గురజాడ రచనలు నేటికీ ఆదర్శ ప్రాయమని సీతం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు అన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా గురజాడ చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. విద్యార్థులంతా అడుగుజాడలలో నడవాలని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసోసియేషన్ల కబడ్డీ



- బయటపడ్డ అసోసియేషన్ల మధ్య విబేధాలు
- క్రీడాకారుల జీవితాలతో ఆటలు
- వాకౌట్‌లతో సిఎం ప్రైజ్ మనీ కబడ్డీ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారుల జీవితాలను బాగు చేయాల్సిన కబడ్డీ అసోసియేషన్ నాయకుల మధ్య విబేధాలు నెలకొనడం క్రీడాకారుల పట్ల శాపంగా మరాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సిఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్ నాలుగు క్రీడాంశాల్లో నిర్వహిస్తోంది. నియోజకవర్గాల పోటీలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం నుంచి జరుగుతున్నాయి. వాలీబాల్, క్రికెట్ పోటీలు ప్రశాంతంగా జరిగినప్పటికీ కబడ్డీ పోటీలు మాత్రం అసోసియేషన్ల మధ్య విబేధాలు కారణంగా వాకౌట్‌ల నడుమ ముగిసింది. మంగళవారం సాయంత్రం గజపతినగరం, విజయనగరం నియోజకవర్గాల జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో వివాదంతో ప్రారంభమైన రగడ చివరకు చీపురుపల్లి జట్టు నెల్లిమర్లతో ఆడకుండానే వాకౌట్ చేసింది. ఫైనల్ లో గజపతినగరం ,నెల్లిమర్ల నియోజకవర్గాల మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను నెల్లిమర్ల జట్టు బహిష్కరించడంతో గజపతినగరం జట్టును విజేతగా ప్రకటించాల్సి వచ్చింది. చిన్న చిన్న విబేధాలు కారణంగా మంగళవారం రాత్రి జరగాల్సిన సెమీఫైనల్,ఫైనల్ మ్యాచ్ లు బుధవారం నిర్వహించాలని నిర్ణయం చేశారు. చివరకు ఒక అసోసియేషన్ నాయకులు వారి పిల్లలకు ఫోన్లు చేసి మ్యాచ్‌లు ఆడొద్దని చెప్పడంతో నియోజకవర్గ టీమ్ లో ఉన్న క్రీడాకారులు ఆడేందుకు రాలేదు. ఉదయం 10గంటలకు జరగాల్సిన మ్యాచ్‌లు ఆయా జట్ల క్రీడాకారులు రాకపోవడంతో 12గంటలకు ప్రారంభించారు. నెల్లిమర్ల జట్టు ఫైనల్ లో ఆడకుండా కొందరు క్రీడాకారులు రాలేదని చెప్పి వచ్చిన వారంతా ఆడకుండా వాకౌట్ చేసారు. దీంతో గజపతినగరం జట్టును విజేతగా ప్రకటించారు.

ఎంతో ప్రతిష్టాత్మకంగా సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ నిర్వహిస్తుంటే వాటిని జయప్రదం చేసి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అసోసియేషన్ నాయకులు వారిని అడొద్దని చెప్పడం సమంజసం కాదని పలువురు క్రీడాభిమానులు అంటున్నారు. వారి వ్యక్తిగత ప్రతిష్ట కోసం క్రీడాకారులను ఇలా ఇబ్బంది పెట్టడం సరైనది కాదని వాపోతున్నారు. ఇప్పటికే కరోనా కారణంగా క్రీడలు ఆడక సర్టిఫికెట్లు లేక ఎంతో మంది క్రీడాకారులు ఉద్యోగాలు అవకాశాలు కోల్పోయారు. ప్రభుత్వం స్పందించి అసోసియేషన్ల మధ్య విబేధాలు పరిష్కరించక పోతే క్రీడలను నమ్ముకున్న విద్యార్థులు రెండింటికీ చెడ్డ రేవడిలా మారే ప్రమాదం ఉంది. విజయనగరం అంటే క్రీడలకు ప్రసిద్ధి. అసోసియేషన్లలో విబేధాలు కారణంగా ఆ పేరు మంట కలిసే పరిస్థితి ఏర్పడుతోంది.

కబడ్డీలో గజపతినగరం.. వాలీబాల్‌లో విజయనగరం జట్టు విజేత

సిఎం కప్ ప్రైజ్ మనీ జిల్లా టోర్నమెంట్‌లో వాలీబాల్ విజేతగా విజయనగరం నియోజకవర్గం జట్టు నిలవగా, కబడ్డీ పోటీల్లో విజేతగా గజపతినగరం జట్టు నిలిచింది. వాలీబాల్ ఫైనల్ పోటీలు చీపురుపల్లి, విజయనగరం నియోజకవర్గాల జట్ల మధ్య జరగ్గా మూడు సెట్లలో రెండు సెట్లు గెలిచి విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. రన్నర్ గా చీపురుపల్లి జట్టు నిలిచింది. కబడ్డీ వాకౌట్‌లతో ఫైనల్‌కు గజపతినగరం, నెల్లిమర్ల జట్లు వెళ్లగా నెల్లిమర్ల జట్టు ఫైనల్‌లో వాకౌట్ చేయడంతో విజేతగా గజపతినగరం నియోజకవర్గం జట్టును విజేతగా చీఫ్ కోచ్ అప్పలనాయుడు ప్రకటించారు. మరో వైపు విజ్జీ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి గురువారం ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. విజేతలను సెట్విజ్ సిఇఒ రామానందం, చీఫ్ కోచ్ అప్పలనాయుడు అభినందించారు. జిల్లా విజేతలుగా నిలిచిన జట్లు జోనల్ పోటీల్లో పాల్గొన నున్నాయి.



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జెసి మయూర్ అశోక్

50,148 మందికి విద్యాదీవెన

రూ.26.97 కోట్లు జమ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 50,148 మంది విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద రూ.26కోట్ల, 97లక్షల, 29వేల, 987ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం బటన్ నొక్కి, విద్యార్థుల తల్లుల ఖాతాలో ఈ మొత్తాన్ని నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని లైవ్‌టెలీకాస్ట్ ద్వారా జిల్లాలో తిలకించారు. వివిధ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్‌లలో చదువుతున్నప్రతీ పేద విద్యార్థికీ, పూర్తి పీజు రీఎంబర్స్ మెంట్ కింద ఈ మొత్తాన్ని విడుదల చేశారు. మొత్తం 50,148 మంది విద్యార్థుల్లో బిసిలు 40,408 మంది, ఎస్‌సిలు 4,843, ఇబిసిలు 2,843, కాపు 1,007, ముస్లిం 248, క్రిష్టియన్లు 42 మంది ఉన్నారు.జులై-సెప్టెంబరు త్రైమాసికానికి సంబంధించి, మొత్తం రూ.26.97 కోట్లను విడుదల చేశారు.

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకొని విద్యార్థులు వృద్ధిలోకి రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. విద్యాదీవెన పథకానికి సంబంధించిన చెందిన చెక్కును, విద్యార్థులకు, వారి తల్లి తండ్రులకు కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులకు నిరసనగా

యుటిఎఫ్ ఆధ్వర్యాన జాగరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

పెండింగ్ బకాయిల విడుదలకై బుధవారం విజయవాడలో తలపెట్టిన ధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం అనుసరించిన దమన కాండను నిరసిస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విజయనగరం, బొబ్బిలిలో నిరసన జాగరణ చేపట్టారు. విజయనగరంలోని ఆర్అండ్‌బి జంక్షన్, బొబ్బిలిలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 12గంటల వరకు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు బకాయిపడిన డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, పిఆర్‌సి, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని అడిగితే కనీసం ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేపడితే యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ ధమనకాండకు నిదర్శనమని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల నిరసనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధం తగదని అన్నారు. అక్రమ అరెస్టులను ఖండించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్,స్వామినాయుడు, ఎ.శ్రీనివాసరావు, రమేష్, కె.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, వాసు, తిరుపతి నాయుడు, రాజారావు, శంకరరావు, ఆనంద్ రాంప్రసాద్ శ్రీను వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



బొబ్బిలి : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నాయకులు అరెస్టు

బకాయి పడ్డ డిఎలు ఇవ్వాలని, పిఎఫ్ లోన్లు పార్ట్ పేమెంట్లను, ఎపి జిఎల్ఐ లోన్లు , సరెండర్ లీవ్ బకాయిలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం విజయవాడలో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని ప్రభుత్వం భగ్నం చేసింది. జిల్లాలో యుటిఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు విజయవాడ ధర్నాకు హాజరైన నాయకులను సైతం అరెస్ట్ చేసింది. జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జె.రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు లను అరెస్ట్ చేసి విజయవాడ శివారు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

చాగంటికి గురజాడ పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు విశిష్ట పురస్కారాన్ని చాగంటి కోటేశ్వరరావుకు అందజేశారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన బుధవారం రాత్రి స్థానిక జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఏర్పాటు చేసిన సభలో ఈ పురస్కారాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మి చేతులమీదుగా చాగంటికి అందజేశారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం సమాఖ్య సభ్యులకు ఫోన్‌చేసి పురస్కారం ఇవ్వడానికి ఎటువంటి ఇబ్బందులున్నా తిరస్కరించేందుకు తనకు అభ్యంతరం లేదని చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే ఎటువంటి అభ్యంతరాలు లేవని సమాఖ్య సభ్యులు చెప్పడం వల్లే తాను ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నానని తెలిపారు. గురజాడ కవిత్వాలు చూసి పులకించని వారు ఎవరుంటారని అన్నారు. గురజాడ రాసిన పలు పద్యాలకు ప్రవచనాలు చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ గురజాడ భౌతికంగా లేక పోయినా ఆశయాలు,ఆలోచనలు సజీవంగా ఉంచడానికి అనేకసంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఒక గురజాడ సాంస్కతిక సమాఖ్యకాదు ఏ సంస్థ కైనా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కలెక్టర్ ఎం.సూర్యకుమారి మాట్లాడుతూ గురజాడ ఆశయ సాధనకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గురజాడ వారసులైన గురజాడ వెంకట అప్పారావు, ఇందిరా, లలిత, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు, జక్కు రామకృష్ణ, భీష్మారావు, బైరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, నారాయణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్యుల ఐక్యత, అభ్యున్నతికి కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని సుజాత కన్వెన్షన్‌లో ఆర్యవైశ్య ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా వెంకటేశ్వర ఆలయం నుంచి కోలగట్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ తాను సామాన్య కార్యకర్తగా 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేసానని అన్నారు. ఎన్నో ఒడిదుడుకులు పడి, శాసన సభ్యునిగా ఓటమి చెందినా, టిడిపి వారు హేళన చేసిన, మొక్క ఓని దీక్షతో, తాను జీవితంలో ఒక్కసారి అయినా అశోక గజపతిరాజు పై గెలుస్తానని చెప్పడం జరిగిందన్నారు.

వార్డులపై వివక్ష అన్యాయం

కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో టిడిపి కౌన్సిలర్లు ఉన్న వార్డుపై వివక్షత చూపడం అన్యాయమని ఆ పార్టీ కౌన్సిలర్లు రాంబార్కి శరత్, గెంబలి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్లో బుధవారం ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని చెపుతున్న వైసిపి నాయకులు మున్సిపాలిటీలో టిడిపి వార్డులపై వివక్షత చూపడం అన్యాయమన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించడం దుర్మార్గమన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు లేకపోతే ఇల్లు ఎలా కడతారని ప్రశ్నించారు. దాడితల్లి కాలనీలో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కాకల గోవిందమ్మ కోరారు. వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సింగిల్ టెండర్లు వస్తున్నాయని, లోకల్ కాంట్రాక్టర్లు ఎందుకు టెండర్లు వేయడం లేదని ప్రశ్నించగా కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు చేసేందుకు ముందుకు వస్తున్నారని డిఇ రవికుమార్ చెప్పారు. అభివృద్ధి పనులు పర్యవేక్షణకు బందాలను ఏర్పాటు చేయాలని వైసీపీ కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు కోరారు. టిడ్కో ఇల్లు రద్దు చేసిన లబ్ధిదారులకు డిడిలు వెనక్కి ఇవ్వాలని కౌన్సిలర్ వాడపల్లి వనజకుమారి కోరగా సమస్య ఎమ్మెల్యే దృష్టిలో ఉందని త్వరలో పరిష్కారం చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ అన్ని వార్డులనూ అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ న్యాయవాదిగా డి.అప్పలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు చెలికాని మురళి, జ్.రమాదేవి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



వాగ్వివాదం చేస్తున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి-పార్వతీపురం

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అందుకు అధికారులంతా సహకారం అందించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై జెసి ఒ.ఆనంద్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే వాటిని సిఎం, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జెసి ఆనంద్ మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో 15 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. జిల్లాలో 188 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో 8,86,465 గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

15 రోజుల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

- మండలాల వారీ సదరం క్యాంపులు
- ఎస్‌సి వసతి గృహాల శాశ్వత భవనాలకు కృషి
- ఎస్‌సి సంక్షేమ కమిటీ ఛైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి-విజయనగరం

వచ్చే 15 రోజుల్లో అన్ని శాఖల్లోనూ ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ ఛైర్మన్ గొల్ల బాబూరావు తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సంబంధిత అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామని అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కలెక్టర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో ఎస్‌సి సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల ద్వారా ఎస్‌సిలకు అమలు చేస్తున్న పథకాలు, ఖర్చు చేస్తున్న నిధులపై సమీక్షించారు. బ్యాక్ లాగ్ పోస్టుల నియామకానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అవరోధాలూ లేవని, పోస్టులకు తగ్గ అర్హత గల అభ్యర్థులు లేకపోతే సడలింపు కోసం ప్రభుత్వానికి రాసి నియామకాలు జరపాలని సూచించారు. ఎస్‌సిల కోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయడం లో అధికారులు చిత్త శుద్ధి చూపాలన్నారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో ఎస్‌సి వారికీ వేరేగా కేటాయించకుండా ఇతరులతో కలిపి వారి మధ్యనే గృహాలు కేటాయించాలని సూచించారు. హౌసింగ్ పీడీ రమణ మూర్తి మాట్లాడుతూ జగనన్న లే ఔట్లలో అన్ని ప్రాథమిక వసతులతో కూడిన గృహాలను12 శాతం ఎస్‌సిలకు కేటాయించినట్లు తెలిపారు. చేయూత పథకం కింద ఎంత మంది ఎస్‌సిలకు లబ్ధి చేకూరిందని ఛైర్మన్ అడగడంతో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ సుమారు రూ.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సామజిక పరంగా రుణాలు అందించి ప్రోత్సహించాలని, చేయూత కింద పాడి గేదెలను అందించాలని ఛైర్మన్ తెలిపారు. వికలాంగులకు సదరం సర్టిఫికేట్ల జారీకి ప్రతి మండలంలో ప్రతి నెలా సదరం క్యాంపులను ఏర్పాటు చేసి వారికి సదరం సర్టిఫికేటలను అందజేయాలని సూచించారు. అర్హతను బట్టి పింఛను కూడా మంజూరు చేయాలన్నారు. జిల్లా పరిషత్ నిధుల నుండి ఎస్‌సిలకు 15 శాతం కేటాయిస్తున్నామని జెడ్‌పి సిఇఒ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని తెలపగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమా శంకర్ స్పందిస్తూ ఈ పథకం కింద ఇప్పటికే 12.9 శాతం ఎస్‌సిలను కవర్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ జిల్లాలో 30 వసతి గహాలు ఉన్నాయని, వాటిలో 6 వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో ఉన్నాయని, వాటికే శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. జిల్లా యంత్రాంగం తరపున స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఛైర్మన్ స్పందిస్తూ రాత పూర్వకంతా ప్రతిపాదనలను తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి దీపిక పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఈఏడాది 93కేసులు ఎస్‌సిలపై నమోదు అయ్యాయని, అందులో 3 కేసులు విచారణ లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సభ్యులు అలజంగి జోగారావు, కంబాల జోగులు, చిట్టిబాబు, ఎంఎల్‌సి శ్రీనివాసులు రెడ్డి, ఇందుకూరి రఘు రాజు, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతి రావు, సోషల్ వెల్ఫేర్ డిడి సుధాకర్ , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ బాబూరావు

సత్యంనాయుడు కుటుంబానికి మంత్రి పరామర్శ

వేపాడ : మండలంలోని నీలకంఠరాజుపురం సీనియర్ వైసిపి నాయకుడు మూకల సత్యంనాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు గురువారం పరామర్శించారు. సత్యంనాయుడు భార్య మూకల కస్తూరితో పాటు వారి పిల్లలతో మంత్రి మాట్లాడి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యంనాయుడు మరణం ఆయన కుటుంబానికి, పార్టీకి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, చిన్న గుడిపాల మాజీ సర్పంచ్ ఈశ్వరరావు, వల్లంపూడి వైస్ సర్పంచ్ రుద్ర వెంకట్రావు, ఎస్. ఆనందపురం గ్రామ సర్పంచ్ అప్పాజీ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీలు

నెల్లిమర్ల : ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) డిసెంబరు 5,6, తేదీల్లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2022 పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్ పాల్ డాక్టర్ నల్ల తిరుపతి నాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల చెందిన 9,10,11,12 వ తరగతులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పలు అంశాల్లో జిల్లా స్థాయిలో కళా ఉత్సవ పోటీలు తమ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి అర్హత ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొనాలని కోరారు. ప్రతి అంశంలోను ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందని, వ్యక్తిగత పోటీదారులకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తొలి రోజు ఓకల్ మ్యూజిక్ (క్లాసికల్ మరియు ట్రెడిషనల్) ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డాన్స్ (క్లాసికల్ మరియు ఫోక్) పోటీలు నిర్వహిస్తామని, రెండో రోజు విసువల్ ఆర్ట్స్ (డ్రాయింగ్), ఏకపాత్రాభినయం, స్వదేశీ బొమ్మలు, ఆటలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు అధ్యాపకులు పి.రవికుమార్ 7989350244, కె.సూర్యారావు 8919985388, కె.చంద్రశేఖర్ రావు 9440512438లను సంప్రదించాలన్నారు.

హుటాహుటిన రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

జామి : జామి, భీమసింగి ఆర్ అండ్ బి రహదారి మరమ్మత్తు పనులు ఊపందుకున్నాయి. గత కొద్ది రోజులుగా ' ప్రజాశక్తి ' దిన పత్రికలో రహదారి అధ్వాన్నంపై వరుస కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. తాజాగా భీమసింగి జంక్షన్ వద్ద నుంచి ధ్వంసమైన రహదారి మరమ్మత్తు పనులు చేపడుతున్నారు. పాడైన రహదారిని తొలగించి, తార్రోడ్డు రహదారిని నిర్మిస్తున్నారు. ఎస్.కోట నుంచి భీమసింగి వరకు 19 కిలోమీటర్ల రహదారి సుమారుగా రూ.5కోట్లు పెట్టి, నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. కానీ జామి, భీమసింగి జంక్షన్లను కలిపే 5 కిలో మీటర్ల రహదారి దారుణంగా దెబ్బతినడం, కొత్త రోడ్డు కట్టకుండే మదలు పడడం కాంట్రాక్టర్ వైఫల్యమే అని ప్రజలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ప్రజాశక్తి 'మూణ్ణాళ్ళ ముచ్చటే, భారీ వాహనాలు తిరగడం వలనే' అనే శీర్షికలతో వరుసగా కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు, ప్రజలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత చదువులు చదవాలి : ఎమ్మెల్యే

బొబ్బిలిరూరల్ : ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక స్తోమతలేని ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యా దీవెన పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులపై భారం పడకుండా కాలేజీలకు ఎంత మొత్తం ఫీజు చెల్లించాలో అంత మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ ఇంజనీరింగ్, మెడిసిన్ చదివిన విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజులు మొత్తాన్ని త్రైమాసికం వారీగా నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన చేతుల మీదుగా జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆటో వేలం

శృంగవరపుకోట : పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద గురువారం ఆటో వేలం వేయనున్నామని ఎస్ఇబి సిఐ ధర్మారావు తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేసు నెంబర్ 175/2015-16లో గంజాయితో స్టేషన్ పరుచుకున్న ఆటోను గురువారం ఉదయం వేలం వేస్తామని ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చునని ఆయన తెలిపారు.

హరిత రాయబారుల నిరసన

రామభద్రపురం : గ్రామాల పారిశుధ్య నిర్వహణలో విశేష కృషి చేస్తున్న హరిత రాయ బారుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన చేపట్టి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బలసా శ్రీను మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు సుమారు 6 నుంచి 8 నెలల వేతనాలు బకాయి ఉన్నాయని వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా వేతనాలు ప్రతీ నెల 5వ తేదీ లోపు ఇవ్వాలన్నారు. శుభ్రత పనులకు వినియోగించే గ్లౌజులు, సబ్బులు, హెల్మెట్‌లు, అలవెన్స్ ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులకు గురిచేయకుండా చెత్త బల్లు మరమ్మతులు చేయించి పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అప్పారావు, సింహాచలం, గౌరీ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

కొత్తవలస : గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రాన్ని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, రీజనల్ డైరెక్టర్ మంతెన మాధవి బుధవారం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, ప్రభుత్వం అందిస్తున్న ఆహార పదార్థాలు సక్రమంగా అందుతున్నాయా అన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వియ్యంపేట సిడిపిఒ ఆర్.ఉమా దేవి, అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.రమణమ్మ పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఉద్యోగుల ర్యాలీ

విజయనగరం కోట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిబ్బంది బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమర్ భవన్ నుంచి బాలాజీ జంక్షన్, కోటమీదుగా డిసిసిబి బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిసిసిబి సిఇఒ కె.జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎల్.రామ్మూర్తి, పి.రాము నాయుడు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం సిబ్బందికి వేతన సవరణ చేసి జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు.

పాత పద్ధతిలో సెలవులు ఇవ్వాలని ధర్నా

బొబ్బిలి: మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు పాత పద్ధతిలో సెలవులు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో సెలవులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పాత పద్ధతిలో సెలవులు ఇవ్వకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సబ్బులు, కొబ్బరి నూనె, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ముగిసిన ఎన్‌సిసి శిబిరం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో ఈనెల 21 నుంచి నిర్వహించిన ఎన్‌సిసి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ శిక్షణలో పదో తరగతి నుంచి 80 మంది విద్యార్థులు, 12వ తరగతి నుంచి 88 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణాధికారిగా వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్ వ్యవహరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ కల్నల్ ఎం.కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా క్యాంప్ ఫైర్, బ్యాండ్ నిర్వహించారు.

రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి - కొత్తవలస

మహిళలు బట్టలు లేకుండానే అందగా ఉంటారని రాందేవ్ బాబా మాట్లాడటం మహిళని అవమాన పరచడమేనని అతనిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ డిమాండ్ చేశారు. ఐద్వా ఆలిండియా పిలుపు మేరకు బుధవారం కనపాకలో జరిగినా హింసా వ్యతిరేక ర్యాలీనుద్దేశించి ఆమె మాట్లాడుతూ రోజూ రోజుకి మహిళలుపై రకరకాల రూపల్లో దాడులు అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. మొన్న 'గరికిపాటి' మహిళలు వేసుకునే బట్టలుపై కామెంటు చేశారని, ఇప్పుడు రాందేవ్ బాబా ఇలా రోజుకొకరు మహిళలను హింసకు గురి చేస్తున్నారని అన్నారు. యోగా ముసుగులో, బాబాలు ముసుగులో, ప్రవచనాలు ముసుగులో, మహిళల్ని మభ్యపెట్టాలని చూసిన వారిపై ఈ ప్రభుత్వాలు తగిన



నిరసన ర్యాలీ చేస్తున్న ఐద్వా నాయకులు

చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. మనదేశంలో రోజుకు 86 అత్యాచారాలు జరుగుతున్నాయని సగుటున గంటకి 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయని అన్నారు. ప్రతి 77 నిమషాలకు ఒక వరకట్న హత్య జరుగుతుందని, ప్రతి 48 నిమషాలకు ఒక దళిత మహిళా అత్యాచారానికి గురవుతోందని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75ఏళ్ళుపూర్తి చేసుకున్నా ఆడపిల్లలకు సరైన విద్య, రక్షణ, ఉద్యోగాలు, ఉపాధి లేవన్నారు. శ్రామిక మహిళాలకు సమానపనికి సమాన వేతనం లేదని ఈ ప్రభుత్వాలు 33శాతం రిజర్వేషన్లు బిల్లులు అమలుచేయలేదని చెప్పారు. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్ని అంటుతున్నా యని మరోపక్క మద్యం, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు ప్రభావాం వల్ల యువత పక్క దారి పడుతున్నారు వీటిని ఐద్వా జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయ న్నారు. స్త్రీని ఇంకా సరుకుగానే మార్కెట్ చూస్తుందని ఈ దృక్పథం మారేందుకు ప్రభుత్వాలు తగిన విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఐద్వా నాయకులు వి. లక్ష్మీ, కృష్ణమ్మ, కరుణా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురజాడకు నివాళులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతి పరిధి జరజాపుపేట-1వ సచివాలయంలో బుధవారం గురజాడ అప్పారావు 107వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మహా కవి గురజాడ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : సమాజ సంస్కరణకు రచనలు చేసిన అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని నారాయణప్పవలస ప్రధానోపాధ్యాయులు జె.సి.రాజు అన్నారు. బుధవారం పాఠశాల లో గురజాడ వర్ధంతి సందర్భంగా గురజాడ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు శ్రీనివాసరావు, రామచంద్ర రావు, మురళి, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా పథకాలు పంపిణీ

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం టీబూర్జివలస గ్రామంలో ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్బంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఏ మేరకు అందేయో లబ్ధిదారులును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు సమస్యలు తెలియజేయగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. తొలుత రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్, మండల పార్టీ కన్వీనర్ కడుబండి రమేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సమల శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ మంత్రి క్రాంతి కుమార్, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రతి ఇంటికి ప్రభుత్వ పాలన అందివ్వాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

అన్నారు. బుధవారం రంగరాయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అందిన తీరుపై లబ్ధిదార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి రూ.37లక్షలతో ఇంటి ఇంటి కుళాయిలు మంజూరైన విషయం తెలియజేశారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, మాజీ సర్పంచ్ గేదెల లక్ష్మీ, నాయకులు గేదెల సత్యనారాయణ, కోట గోవిందా, కొప్పర నారాయణరావు, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇది బాధ్యతలేని ప్రభుత్వం

ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి - పూసపాటిరేగ, భోగాపురం

ఇది బాధ్యత లేని ప్రభుత్వమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తోందని అన్నారు. బుధవారం ఆమె పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను, ఉపాధ్యాయులను కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం పోవాలంటే వ్యవసాయం మెరుగు పడాలన్నారు. ఉత్తరాంధ్ర వ్యవసాయానికి సాగు నీరు అవసరం నిమిత్తం రాష్ట్ర విభజనలో సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తామన్నారని గుర్తు చేశారు. బంగాళాఖాతంలో వృథాగా కలిసిపోయే నీటిని స్టోర్ చేసి వ్యవసాయానికి అందించే ఈ ప్రాజెక్ట్ ఇంత వరకూ ప్రారంభం కాలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లేదని, విశాఖపట్నంలో ఐటి హబ్ డవలప్ చేస్తామని చెప్పినా ఇంత వరకూ చేపట్ట లేదన్నారు. దీంతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రవేటీ కరణ లేదా అమ్మేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని ఈ తరుణంలో ఇంత మందికి ఉపాధి కల్పించే ఈ పరిశ్రమలను కాపాడుకోవాలని కోరారు. ఉద్యోగులు,


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రవేటు విద్యాసంస్థలలో పనిచేసిన వారికి వెల్ఫేర్ బోర్డు స్థాపించి వారికి బీమా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సమస్యలపై మన ప్రాంత గొంతు వినిపించడానికే తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. 250 సంఘాలు బలపరుస్తున్న అభ్యర్థి రమా ప్రభ అని యుటిఎఫ్ నాయకులు డి. రాము తెలిపారు.ఆమెను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆమెతో పాటు సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేయాల్సిందే

కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-వేపాడ

ఐదు మండలాల కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు అధ్యక్షతన బుధవారం మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో కార్యకర్తలు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా గొంప వెంకటరావు మాట్లాడుతూ గతంలో పనిచేయని వారిని నమ్మి వారికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మోసపోయి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ఓటమి చెందామని వారంతా తిరిగి వైసిపిలోకి వెళ్లిపోయారని అన్నారు. ఈ సారి అలా కాకుండా నిజమైన మన కార్యకర్తలను కచ్చితంగా గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యకర్తలు సమస్యలను ఎదుర్కొంటున్నపుడు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేలా ఉండాలని మాజీ ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతో ఈసారి ముందుకెళ్తామన్నారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో అందరం కలిసి విజయం సాధించామని 'ఇదేమి ఖర్మ' అనే కార్యక్రమాన్ని డిసెంబర్ 2 నుండి 45 రోజులు నియోజకవర్గంలో నిర్వహిస్తామని దానికి మీరంతా సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర సమన్వయ కమిటీ మెంబర్ కోళ్ల బుచ్చి రాంప్రసాద్, నాయకులు దాసరి లక్ష్మి, గుమ్మడి భారతి, రమణమూర్తి, ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ

డెంకాడ : మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మహిళా సంఘ సభ్యులకు 50 యూనిట్లు పెరట కోళ్లను ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కోళ్లను మహిళలు వినియోగించు కోవాల న్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తమ్మినాయుడు, ఎంపిడిఒ స్వరూపరాణి, విజయ నగరం ఎసి రాజ్ కుమార్, డిపిఎం లైవ్ స్టాక్ మూర్తి, ఎపిఎం విజయలక్ష్మి, మండల సిబ్బంది, సర్పంచులు, పాల్గొన్నారు.


కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి

ఎంవిజిఆర్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి- డెంకాడ

శాస్త్ర వేత్త జగదీశ్ చంద్రబోష్ పుట్టినరోజు సందర్బంగా చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఆత్మ నిర్భర్ భారత్ అండ్ గ్లోబల్ వెల్ఫేర్' అనే అంశంపై సెషన్‌ను నిర్వహించారు. ఈ సెషన్‌కు


జగదీశ్ చంద్రబోష్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న ప్రతినిధులు

విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్, నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లాబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) డాక్టర్ వై.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా, జాతీయ పాలక మండలి సభ్యుడు కె. సుబ్బరాయ శాస్త్రి రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్ రాజు మాట్లాడుతూ ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలో సైన్స్, ఇన్నోవేషన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ కె. సుబ్బరాయ శాస్త్రి మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశానికి ఉన్న ప్రాచీన గుర్తింపుల గురించి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఆ రోజుల్లో బ్రిటిష్ వారి సహాయం లేకుండానే జెసి బోస్ ఐఎసిఎస్‌ను ఎలా ప్రారంభించారో ఆయన వివరించారు. డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ భారత్ యొక్క ప్రాముఖ్యత, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో దానిని సాధించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

బొబ్బిలిరూరల్ : రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు మరిసర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. బుధవారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ సమావేశం మండలంలోని వాకాడవలసలోని పైడితల్లమ్మ గుడి వద్ద ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి విజయనగరం జిల్లా అధ్యక్షులు తెంటు కాశీనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం అనకాపల్లి విశాఖపట్నం ఐదు జిల్లాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు వివిధ జిల్లాలకు చెందిన జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పార్లమెంట్ కన్వీనర్లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే చెరువులు కాపాడుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహాచక్రవర్తి, భారతనంద మహర్షి, పంచిరెడ్డి కృష్ణారావు, జాగరపు ఈశ్వర ప్రసాద్, సంధ్య గజపతిరావు చౌదరి, దాల్నాయుడు, దశరథుడు పాల్గొన్నారు.

తెలుగు కవుల జీవిత చరిత్ర చదవాలి

విజయనగరం కోట : విద్యార్థులు తెలుగు కవులు, రచయితల జీవిత చరిత్రలు చదివి వారి బాటలో నడవడానికి కృషి చేయాలని బి.రామానాయుడు తెలిపారు. బుధవారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. పలకలపై గురజాడ తెలుగు వెలుగు జాడ అని రాసి ప్రదర్శించారు.కళాశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు పాల్గొన్నారు

గురుకులంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బుధవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్బంగా వసతి గృహంలోని విద్యార్థినిలతో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారిని ఏ ధరణి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత అవసరమన్నారు. నిత్యం చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.


నెల్లిమర్ల: విద్యార్థులకు తనిఖీ చేస్తున్న డాక్టర్

నెల్లిమర్ల: స్థానిక బిసి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం స్థానిక సిహెచ్ సి వైద్యులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర, చర్మ వైద్యులు డాక్టర్ వెంకటేష్ విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. డాక్టర్ రవీంద్ర మాట్లడుతూ ప్రతీ నెల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరీక్షల్లో భాగంగా 80 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ పద్మ, ఆశాలు ఉమ, హేమలత పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని కొండ గంగుబూడి పంచాయతీ పరిధిలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 40 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి రమాదేవి తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సత్య, సిబ్బంది, ఆశాలు పాల్గొని రోగులకు సేవలు అందించారు.

గరివిడి : చీపురుపల్లి 5వ సచివాలయం పరిధిలో అడ్డురివీధి మర్రి చెట్టు దగ్గర కర్లాం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ప్రారంభిం చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. అనంతరం వైద్యులు శ్రావ్య తనికీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్ కుప్ప రాంబాయి, ప్రభాత్ కుమార్, సుంకరి చంద్రశేఖర్ గుప్త, ఏఎన్ఎంలు, 104 సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


వేపాడ: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎం. శిరీష, ఎస్.మౌనిక ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటారు. కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న వీరు ఆ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించారు. ఇందులో శిరీష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య బుధవారం శిరీషను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పతకాలు సాధించడానికి కారుకులైన పీడీ ఎన్. వరహాలను కూడా అభినందించారు.

క్రీడాకారులకు పోలీసుల సన్మానం

నెల్లిమర్ల : వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను స్థానిక పోలీసు స్టేషన్‌లో భోగాపురం సిఐ కె.వి. విజయానంద్, ఎస్ఐ పి.


నెల్లిమర్ల: క్రీడాకారులను సత్కరిస్తున్న పోలీసులు

నారాయణరావు బుధవారం సన్మానించారు. ఈ నెల 26, 27, 28తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బి. రాజేశ్వరీ, ఏ.యశశ్రీ, శనపతి పల్లవిలను సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో మరింత రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ చల్లా రాము పాల్గొన్నారు

చిత్ర లేఖనంలో పతకాలు

కొత్తవలస : కంటకాపల్లి జిల్లా పరిషత్తు పాఠశాల చెందిన ఆరుగురు విద్యార్థులు చిత్ర లేఖనం పోటీల్లో పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో ముంబాయిలో జరిగిన చిత్ర లేఖనం పోటీల్లో తమ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని వీరిలో రంభ యామిని, జ్యోషిత, ఎస్.నాగేశ్వరరావులు బంగారు పతకాలు సాధించగా వి.యశ్వంత్, ఎస్.మాధవి, ఎస్.తేజస్వని కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. వీరిని బుధవారం పాఠశాలలో అభినందించారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

రామభద్రపురం : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు హెచ్చరించారు. బుధవారం సాయింత్రం మిర్తివలస జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి వివిధ వాహన చోదకులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. మద్యం తాగినట్లు నిరూపణ జరిగితే ఉపేక్షించేది లేదని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించి అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని అన్నారు.

అలరించిన వయోలిన్ కచేరీ

విజయనగరం కోట : స్థానిక మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సృజనాత్మక సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన ద్వారం వెంకటస్వామి నాయుడు జయంతి సందర్భంగా వయోలిన్ కార్యక్రమం నిర్వహించారు. వయోలిన్ విద్వాన్ లక్ష్మీగణపతి కుమార్, విఘ్నేశ్ శర్మ సహాయసహకారాలు అందించారు.

దొంగ అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

జిల్లాలో ఐదు పగటిపూట దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడ్ని అరెస్టు చేసి, అతని నుంచి 9తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, చీపురుపల్లి ఇన్‌ఛార్జి డిఎస్‌పి బి.మోహనరావు తెలిపారు. బుధవారం 1వ పట్టణ పోలీసు స్టేషనులో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. చీపురుపల్లి మండలం పత్తికాయపాలవలస గ్రామానికి చెందిన వున్నాన రాంబాబు(28) ఆన్‌లైన్ బెట్టింగులు, చెడు వ్యసనాలకు అలవాటు పడి, తన అవసరాలకు తీర్చుకొనేందుకు డబ్బులకు ఆశపడి గ్రామాల్లోను, పట్టణాల్లో పగటిపూట రెక్కీ నిర్వహించి, తాళాలు వేసి వున్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడేవాడు. నిందితుడు ఎస్.కోట, విజయనగరం, జామి, రాజాం పోలీసు స్టేషను పరిధిలో5 దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో ఎస్ఐలు సన్యాసి నాయుడు, లోవరాజు, కానిస్టేబుళ్ళు ఎం. భానోజీరావు, సిహెచ్. జగదీష్, సిబ్బంది కలిసి నిందితుడ్ని పత్తికాయపాలవలస గ్రామ జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. అతని నుంచి 9తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు మరో 3 తులాల బంగారు ఆభరణాలను తన అవసరాలకు వేరే చోట కుదువ పెట్టినట్లుగా గుర్తించారు. వీటిని కూడా పోలీసులు రికవరీ చేసి, బాధితులకు 12 తులాల ఆభరణాలను అప్పగిస్తామని డిఎస్‌పిలు తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పని చేసి, నిందితుడ్ని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు సన్యాసి నాయుడు, జి. లోవరాజు, కానిస్టేబుళ్లు సిహెచ్. వైకుంఠరావు, వి. సూర్యనారాయణ, పి.శ్రీనివాసరావు, వి. వెంకట రమణలను ఎస్‌పి అభినందించారు. వీరికి త్వరలో ప్రోత్సాహక నగదుబహుమతులను అందజేస్తామని డిఎస్‌పిలు తెలిపారు.